ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025
5
శ్రీ సత్యసాయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రుణాల మంజూరుతో అభివృద్ధి

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో బ్యాంకర్లు లబ్ధిదారులకు విరివిగా రుణాలు అందించి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డిసిసి), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డిఎల్ఆర్‌సి) బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షికంగా రూ.14051 కోట్ల రుణాలు అందజేయడం లక్ష్యం కాగా రెండవ త్రైమాసికం సెప్టెంబర్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ కింద రూ.10059 కోట్ల రుణాలు మంజూరు చేసి 71.50 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. వ్యవసాయ రుణాలలో రూ.5071 కోట్లు మంజూరు చేసి 66.84శాతం, ప్రాధాన్యత రంగంలో రూ.7805కోట్లు మంజూరు చేసి 71.59 శాతం ప్రగతి సాధించినట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారులకు రుణాల మంజూరులో జాప్యం చేయరాదన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకూ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని తెలియజేశారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత జిల్లాకు అన్ని విధాల ఆర్థిక రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమణ కుమార్‌తో పాటు వివిధ బ్యాంకుల మేనేజర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

19 పరిశ్రమలకు రూ.4.43కోట్లు మంజూరు

కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఇందులో పరిశ్రమల స్థాపన సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులకు చేసుకున్న దరఖాస్తులను కలెక్టర్ సమీక్షించారు. వివిధ పరిశ్రమలకు సంబంధించిన రాయితీలను సమీక్షించి పెట్టుబడి, వడ్డీ, విద్యుత్, సేల్స్ టాక్స్, స్టాప్ డ్యూటీ తదితర రాయితీల కింద 19 పరిశ్రమలకు రూ.4.43 కోట్లు మంజూరు చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజరు జె.నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నాగ కుమార్, ఎల్‌డిఎం రమణ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పురం' మున్సిపాల్టీలో ఏసీబీ దాడులు

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం నాడు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామాంజినేయులును పట్టుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ముదిరెడ్డిపల్లిలో నివాసముంటున్న రవికుమార్ తనకు ఉన్న స్థలంలో ఇంటిని నిర్మాణం చేసుకోవడానికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను సంప్రదించాడు. రికార్డులను పరిశీలించిన అధికారులు ఖాళీ జాగా పన్ను విధింపు రసీదు లేదని, ఖాళీ జాగా పన్ను చెల్లించి రసీదు ఇవ్వాలని సూచించారు. దీంతో రవికుమార్ తనకు ఉన్న కాళీ జాగా పన్నులు వేయాలంటూ రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. రికార్డులను పరిశీలన చేసిన అధికారులు సచివాలయంలో ఆన్‌లైన్ చేయించిన అనంతరం కలవాలని సూచించారు. అన్ని పనులూ పూర్తిచేసుకుని గురువారం తిరిగి రెవెన్యూ విభాగంలో అధికారిని కలిశాడు. పరిశీలన చేసిన అధికారులు ఖాళీ జాగాకు అధిక పన్ను వస్తుందని, తమకు లంచం ఇస్తే పన్ను తక్కువ చేస్తామని రవికుమార్‌కు సూచించారు. తొలుత రూ.10వేలు అడగ్గా అంత ఇవ్వలేని చెప్పి రూ.7 వేలు ఇచ్చేలా బేరం కుదుర్చుకున్నారు. లంచం డిమాండ్ చేయడం, తన పని జరగకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారుల అవినీతి విషయాన్ని రవికుమార్ 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న నేతత్వంలో సిఐలు హమీద్ ఖాన్, మోహన్ ప్రసాద్, జయమ్మల ఆధ్వర్యంలో అధికారులు పక్కాగా వలపన్ని లంచం తీసుకుంటున్న సమయంలో ఆర్ఐ రామాంజినేయులును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం రెవెన్యూ విభాగంలో అధికారులు పలు దస్త్రాలను పరిశీలించారు. అక్కడి నుంచి ముదిరెడ్డిపల్లిలో ఉన్న 36వ వార్డు సచివాలయానికి రామాంజనేయులు తీసుకువెళ్లి అక్కడ సైతం కొన్ని రికార్డులను పరిశీలన చేశారు. అనంతరం అధికారులు లంచం తీసుకున్న రామాంజినేయులును అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ అన్ని ఆధారాలతో సహా అధికారిని పట్టుకున్నామన్నారు. ఆదివారం కర్నూలులో ఏసీబీ కోర్టులో అతన్ని హాజరు పరుస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

మెప్మా విభాగంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



సిబ్బంది, అధికారులు లేనిపరిపాలన విభాగం

ఏసీబీ దెబ్బకు కార్యాలయం ఖాళీ.!

◆ అధికారులు, సిబ్బంది జంప్ ◆ ఏసీబీ వస్తే అధికారులకెందుకంత భయం అంటూ ప్రజల్లో చర్చ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో శనివారం రెవెన్యూ విభాగంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారుల రాకతో మిగిలిన అన్ని విభాగాలు అధికారులు సైతం మాయం అయ్యారు. నిత్యం మహిళలతో ఉండే మెప్మా విభాగంలో కనీసం డేటా ఎంట్రీ ఆపరేటర్ కూడా లేకుండా అన్నీ ఖాళీ కుర్చీలే కన్పించాయి. ప్రధాన పరిపాలన విభాగంలో ఒక్క గుమస్తా కూడా లేరు. మేనేజర్ ఇతర అధికారులు సైతం సాయంత్రం వరకు అందుబాటులోకి రాలేదు. ఇంజినీరింగ్ విభాగంలో గుమస్తాలు కూడా కార్యాలయానికి రాకుండా మొహం చాటేశారు. పట్టణ పారిశుధ్య విభాగం, జనన మరణాల ధ్రువీకరణ పత్రాలు అందించే విభాగాల్లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. అధికారులెవరూ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఏసీబీ అధికారులు రావడంతో అధికారులందరూ ఇలా భయపడి వెళ్లిపోవడంతో 'పురం' మున్సిపాల్టీలోని అన్ని శాఖల్లో ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందోనన్న చర్చ ప్రజల్లో వినిపిస్తోంది. అధికారులు ఇంతా భయపడి కార్యాలయం ఖాళీ చేయాల్సిన అవసరం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు.

స్వాధీనం చేసుకున్న నగదుతో పాటు అధికారిని చూపిస్తున్న ఎసిబి

ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ విభాగం

సిబ్బంది లేక వెలవెలబోతున్న జనన, మరణ విభాగం

సబ్‌జైలు తనిఖీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

అనంతపురం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎన్.రాజశేఖర్ శనివారం కదిరి సబ్ జైలును సందర్శించారు. బ్యారెక్‌లు, టాయిలెట్లు, వంటగది, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించారు. ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఖైదీలు బయటకు వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆయన వెంట జైలు సూపరింటెం డెంట్ ఉమామహేశ్వర్, లోకేశ్వర్‌రెడ్డి, కోర్టు సిబ్బంది, కదిరి లోక్ అదాలత్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎన్.రాజశేఖర్

యుటిఎఫ్ పది మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

'పది' మోడల్ పేపర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-కొత్తచెరువు

యుటిఎఫ్ ప్రచురించిన పదో తరగతి మోడల్ పేపర్లను శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల కోసం ఏటా యుటిఎఫ్ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల చేత మోడల్ పేపర్లను తయారు చేయించి విద్యార్థులకు అందించడం అభినందనీయమన్నారు. వీటిని విద్యార్థులు ఉపయోగించుకొని మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ జి.కృష్ణప్ప, ఎపిసి దేవరాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి ,ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, శివశంకర్, బాబు, నారాయణరెడ్డి, చంద్రశేఖర్, అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో శ్రీవారి సేవలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో కొలువైన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల కోసం దేవస్థానంలో వసతి గదులు, దర్శనం, అభిషేక పూజలు, ఇతర సేవల బుకింగ్, ప్రసాదం టోకెన్ల విక్రయం వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్లు ఈవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. www.aptemples.org వెబ్ సైట్, లేదా 'మన మిత్ర' వాట్సప్ : 9552300009 ద్వారా బుక్ చేసుకోవచ్చు అన్నారు.

కొట్నూరులో పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొట్నూరులో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసిల్దార్ మైనుద్దీన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం రాజ్యాంగం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అంటరానితనం వంటివి ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలుంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఎస్ఐ ఓబులేసు, వీఆర్వోలు మురళీకృష్ణ, శశాంక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను ఉపయోగించుకోవాలి : జెడిఎ

ప్రజాశక్తి-లేపాక్షి

వ్యవసాయంలో రైతులు సాంకేతికతను ఉపయోగించుకోవాలని వ్యవసాయ సంయుక్త సంచాలకులు(జెడిఎ) రామునాయక్ సూచించారు. లేపాక్షిలో శనివారం మండల వ్యవసాయ అధికారిణి శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జెడిఎతో పాటు కృష్ణ య్య పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రైతులు సాంకేతికతను అనుసరించాలని, డిమాండ్ ఆధారిత పంటలు వేసుకోవాలని, డ్రిప్, స్ప్రింక్లర్లు వాడాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకొని రైతులు నష్టాల బారిన పడకుండా అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, సిబ్బంది విజయ్, హరి, రైతులు వెంకటేశ్, నాగరాజు పాల్గొన్నారు.

వ్యవసాయంపై అవగాహన పత్రాలు విడుదల చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఇళ్ల పట్టాలివ్వకపోతే..

మంత్రి ఇంటి వద్ద ధర్నా చేస్తాం

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-పెనుకొండ

'పెనుకొండ పరిసర ప్రాంతంలో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని అనేక సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించాం.. అయినా వారిలో స్పందన రాలేదు. ఇప్పటికైనా వారు స్పందించకుంటే పేదలతో కలిసి మంత్రి సవితమ్మ ఇంటి వద్ద ధర్నా చేస్తాం. అని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ శనివారం నాడు పెనుకొండ ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పెనుకొండలో మూడేళ్లుగా ఇళ్ల పట్టాల కోసం పేదలు పోరాటం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే అధికారులు తొలగించి వారిని రోడ్డుపాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోలార్ పేరుతో వేలాది ఎకరాల భూములను కార్పొరేట్ శక్తులకు ధారాధత్తం చేస్తున్న కూటమి ప్రభుత్వం పేదలకు సెంటు స్థలం ఇవ్వమంటే మాత్రం చేతులు రాకపోవడం విచారకరం అన్నారు. పట్టణంలోనిప్రభుత్వ భూమిలో పేదలకు ఇంటి పట్టాలు ఇమ్మని కోర్టు సైతం ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ఇలాకాలో పేదలు ఇంటి పట్టాల కోసం నిరసనలు చేస్తున్నారని, ఈ సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో గిరిధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, బ్యాళ్ల అంజి, బాబావాలి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకట్రాముడు గంగాధర్, హబీబ్, అర్చన పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం అందించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణ

పన్నులు పెంచేస్తే ఎలా..?

◆ అజెండాలోనే అభివృద్ధి.. క్షేత్రస్థాయిలో లేదు..
◆ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి
◆ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా ఒక్కసారిగా పన్నులు పెంచితే ప్రజలు ఎలా చెల్లిస్తారని... పన్నుల పెంపుపై అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అధికారులు 52 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ నాగేంద్ర, జయప్పలు మాట్లాడుతూ భవన యజమానులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఒక్కసారిగా పనులు పెంచుతూ డిమాండ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ప్రస్తుతం రూ.400 పన్ను వచ్చే ఒక షెడ్డుకు ఒక్కసారిగా రూ.12వేలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. ముదిరెడ్డిపల్లి ప్రాంతంలో ఒకే రకమైన భవనాలు, పక్క పక్కనే ఉన్నప్పటికీ ఒక భవనానికి తక్కువ మరో భవనానికి ఎక్కువ పనులు ఎలా విధిస్తారు అన్నారు. ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ గతంలో పన్నులు విధించడంలో అధికారులు ఒత్తిళ్లకు, ఇతరాత్ర కారణాలతో కొంతమందికి తక్కువ పన్ను విధించారన్నారు. ప్రభుత్వం శాటిలైట్ ద్వారా జిఐఎస్ సర్వే నిర్వహించి అందులో సూచించిన అంశాల మేరకు పన్నులు విధిస్తున్నట్లు చెప్పారు. మరమగ్గాలు నిర్వహిస్తున్న భవనాలను కమర్షియల్ కాకుండా రెసిడెన్స్‌గా గుర్తించి పన్నులు విధించాలని కౌన్సిలర్ జయప్ప కోరారు. అధిక పన్నులపై ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్ నాగేంద్ర, రాఘవేంద్రాలు కోరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం నుంచి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిశీలన చేసి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ కొళాయి కనెక్షన్లు అధికంగా ఉన్నాయని, వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ రామచంద్ర కోరారు. ప్రతినెలా జరిగే కౌన్సిల్ సమావేశంలో పట్టణ అభివద్ధి కోసం లక్షలాది రూపాయలు కేటాయిస్తూ అజెండాలో ఆమోదం తీసుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో అభివద్ధి ఎక్కడా కనిపించడం లేదని కౌన్సిలర్ రాఘవేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వార్డుకు రూ.3లక్షలు కేటాయించారని, ఆ నిధులతో అభివద్ధి పనులు ఇప్పటికీ చేపట్టలేదన్నారు. ఈ పనులు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న కాంట్రాక్టర్లను గుర్తించి వారిని బ్లాక్ లీస్టులో పెట్టాలని కౌన్సిలర్ రాఘవేంద్రతో పాటు మరికొందరు డిమాండ్ చేశారు. పురపాలక సంఘ వ్యాప్తంగా ఖాళీ స్థలాలు అన్నింటిని గుర్తించి ప్రత్యేక జెసిబిలు ఏర్పాటు చేసి స్థలాను శుభ్రం చేయిస్తామని, దానికి అయినా ఖర్చులు స్థల యజమానితో వసూలు చేస్తాంమని కమిషనర్, ఛైర్మన్ తెలిపారు. అజెండాలోని అన్ని అంశాలపై చర్చించి 43వ అంశంలో ఉన్నా చికెన్ వ్యర్థాలను తరలింపు, 46వ అంశంలో ఉన్న రాత్రి బస కేంద్ర బిల్లుల చెల్లింపు అంశాలను మినహాయించి మిగిలిన అంశాలు అన్నింటికీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమధానం ఇస్తున్న కమిషనర్ మల్లికార్జున

నవజాత శిశువు మృతిపై విచారణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రెండు రోజుల క్రితం శిశువు మృతి ఘటనపై జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ ఫైరోజా బేగం పెనుకొండ డివిజన్ ఉప వైద్యధికారిణి డాక్టర్ మంజువాణితో కలిసి శనివారం విచారణ చేపట్టారు. గర్భిణి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి ప్రసవం, శిశువు మరణం వరకు జరిగిన అన్ని విషయాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళ దివ్యశ్రీతో అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎన్‌సియు విభాగం, చిన్న పిల్లల విభాగంలోని వైద్యులతోనూ బిడ్డ ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ శివకుమార్, ఇన్‌ఛార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బాబాబుడేన్, డాక్టర్ కెసికె నాయక్‌తో సమావేశమై శిశువు మతిపై సమీక్ష జరిపారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు తెలియజేస్తామని జిల్లా వైద్యాధికారి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ నాయక్, వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్‌తోపాటు వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన శిశువు తల్లితో వివరాలు తీసుకుంటున్న జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్ బేగం

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-పరిగి

గ్రామీణ స్థాయి నుంచి అన్ని కమిటీలను ఏర్పాటు చేసి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎఐసిసి సభ్యుడు అజయ్‌సింగ్ పిలుపునిచ్చారు. శనివారం నాడు పరిగి సేవామందిర్ కెటి.శ్రీధర్ నివాసంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక అధికార ప్రతినిధి తులసి రెడ్డి, కడప మాజీ ఎమ్మెల్యే కమలమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐసీసీ మెంబర్ అజయ్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తులసి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయిలో మరింత బలపడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 2029 నాటికి దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో హిదాయతూల్లా, నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహులు పాల్గొన్నారు.

కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతున్న తులసిరెడ్డి, చిత్రంలో ఏఐసీసీ మెంబర్ అజయ్ సింగ్

అంగన్వాడీ హెల్పర్‌పై దాడి హేయం

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

అంగన్వాడీ హెల్పర్‌పై దాడి హేయమైన చర్య అని ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిఎస్.శ్రీదేవి పేర్కొన్నారు. రామగిరి మండలం మంగాపురం గ్రామంలో అంగన్వాడీ హెల్పర్ ఇంద్రజపై దాడిని ఆమె ఖండించారు. అలాగే దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం చెన్నేకొత్తపల్లి అంగన్వాడీ ప్రాజెక్ట్ అధికారిణికి వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఐదేళ్లుగా పనిచేస్తున్న అంగన్వాడీ హెల్పర్‌ను రాజీనామా చేయమని ఒత్తిడి చేయడంతో పాటు ఆమె వీరి మాట వినలేదనే అక్కసుతో మహిళ అని కూడా చూడకుండా విచక్షణా రహితంగా దాడి చేయడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీ ఉద్యోగులపై జరుగుతున్న దాడులపై జిల్లా ఐసిడిఎస్ అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ నాయకురాళు రమణమ్మ, లక్ష్మీదేవి, అముజాక్షి పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

హిందూపురం : మండలం, పట్టణ వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు శనివారం నాడు ఎంజీఎం మైదానంలో క్రీడా పోటీలను మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్న లక్ష్మీల ఆధ్వర్యంలో నిర్వహించారు. త్రో బాల్, క్రికెట్ తదితర పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని డివిజన్ స్థాయికి ఎంపిక చేయనున్నట్లు ఎంఇఒ తెలిపారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకున్నారా..?

◆ గత ప్రభుత్వంలో చేసిన పనులపై విచారణ వేశారా.. ◆ అధికారులపై ఎమ్మెల్యే రాజు ఆగ్రహం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

నగర పంచాయతీ పరిధిలో అక్రమ కట్టడాల విషయంలో బలవంతులకు సహకరిస్తూ, బలహీనులను తొక్కిపెట్టడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు అధికారులపై హెచ్చరించారు. నగర పంచాయతీ ఛైర్మన్ నర్సింహరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు విజిలెన్స్ ఎంక్వైరీ వేశారా? లేదా.. అది ఎంతవరకూ వచ్చిందని ఆరా తీశారు. అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు చేపట్టారని ప్రశ్నించారు. నగర పంచాయతీకి ఆదాయం వచ్చే వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కట్టడాలపై కోర్టుకు సరైన నివేదిక పంపాలన్నారు. అక్రమ కట్టడాలు నిర్మించుకుంటూ నగర పంచాయతీకి ఆదాయాన్ని గండికొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గత కౌన్సిల్‌లో చేసిన తీర్మానాల్లో ఎంతవరకు అమలయ్యాయి, పురోగతి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కొత్తగా 445 విద్యుత్ స్తంభాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కోటి రూపాయల నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. అర్బన్ డెవలప్మెంట్ కింద మంత్రికి రూ. 3 కోట్లకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నగర పంచాయతీ అభివృద్ధే ధ్యేయమని, నగర పంచాయతీ పరిధిలో ప్రతి పనిని టెండర్ ద్వారానే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ జగన్నాథం, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు

గ్రామ కంఠం భూములు రిజిస్ట్రేషన్ చేయించుకోండి

నగర పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 419-లో ఉన్న 63 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ అవుతుందని, దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాజు, సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తి తెలిపారు.

పోలీసులు బాధ్యతగా పనిచేయాలి

నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పోలీసులు బాధ్యతలను శ్రద్ధగా నిర్వర్తిస్తేనే పోలీస్ శాఖ గౌరవం మరింత పెరుగు తుందని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని సాయి ఆరామంలో శనివారం జిల్లాలోని సబ్ డివిజన్ల డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ కేసులపై విస్తృత సమీక్ష చేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసులంటే నేరస్థుల కు భయం, నిరపరాదులకు నమ్మకం ఏర్పడాల న్నారు. తప్పు చేసిన వారికి శిక్ష పడితే మళ్లీ నేరం చేయడానికి భయపడతారని, ఆ దిశగా పోలీస్ శాఖ కట్టుదిట్టంగా పని చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను త్వరితగతిన పూర్తి చేసి కోర్టులో సాక్ష్యాలతో నేర నిరూపణ జరిగేలా చూడాలని ఆదేశించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉన్న వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టాలన్నారు. డీఎస్పీలు కేసులను ప్రతి రోజూ మానిటరింగ్ చేయాలన్నారు. రౌడీషీటర్ల కదలికలను పర్యవేక్షించాలని, ప్రతి ఆదివారం వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. ఎక్కువ నేరాలకు పాల్పడే వారిపై పీడి యాక్ట్ నమోదు చేయాల న్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మిస్సింగ్ కేసులపై

నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరాలు, మహిళా భద్రత, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పేకాట, మట్కా, గంజాయిని పూర్తిగా అరికట్టాలన్నారు. ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీఎస్పీలు విజయ్‌కుమార్, మహేష్, హేమంత్‌కుమార్, నర్సింగప్ప, ఇందిర, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, ఇతర సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కామ్రేడ్ హైదర్ వలి సేవలు మరువలేనివి

సంతాప సభలో వామపక్షపార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కామ్రేడ్ హైదర్ వలి సేవలు మరువలేనివని వామపక్షపార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో శనివారం సిపిఎం, సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో కామ్రేడ్ హైదర్ వలి సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేషు, శ్రామిక మహిళా కన్వీనర్ డి.దిల్షాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అయూబ్‌ఖాన్, సిపిఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, ట్రాన్స్‌పోర్ట్ రంగం జిల్లా కార్యదర్శి పెడబల్లి బాబా హాజరై మాట్లాడారు. ముందుగా వారు హైదర్‌వలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హైదర్ వలి

సంతాప సభలో మాట్లాడుతున్న జి.ఓబులు

16 ఏళ్ల ఆటో కార్మికుడిగా, సిఐటియు నాయకుడిగా, ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ రంగం అధ్యక్షుడిగా ఎన్నో సేవలు అందించారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి, సంఘానికి తీర్చలేనిదన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జెవి.రమణ, ఎల్.ఆదినారాయణ, చేనేత, ట్రాన్స్‌పోర్ట్, అంగన్వాడీ, ఆశా వర్కర్స్, మున్సిపల్ కార్మిక సంఘం, సత్యసాయి వాటర్ వర్కర్స్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు రెహానా

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎస్‌జిఎఫ్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు స్థానిక జైన్ స్కూల్ విద్యార్థి రెహానా ఎంపికైనట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజమహేంద్రవరంలో 69వ ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలను అండర్-14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు నిర్వహించారన్నారు. అందులో జైన్ స్కూల్ విద్యార్థులు అండర్-17(82 కిలోల విభాగంలో) రెహాన్ బంగారు పతకం, 74 కిలోల విభాగంలో రబ్బన్ కాంస్య పతకం సాధించార న్నారు. బంగారు పతకం సాధించిన రెహానా 2026 జనవరిలో పూణేలో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారన్నారు. వారికి హెచ్‌ఎం ఉమామహేశ్వర్, సిఒఒ సాగర్, ఉపాధ్యాయులు ఫారుక్‌భాషా, చరిత, బాలాజీ, భాగ్యలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు గంగాద్రి, కరాటే మాస్టర్ షాకీర్ అభినందించారు.

గంగమ్మ జాతరకు ఎమ్మెల్యే విరాళం

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని గంజివారిపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో నడివీధి గంగమ్మ జాతర నిర్వహ ణకు శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ. 50 వేల విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, నాయకులు భార్గవ్‌రెడ్డి, అక్బర్‌బాషా, నాగేంద్ర, ముస్తఫా, ఆదిల్‌బాషా, ఖదీర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

బాలల పరిరక్షణ, హక్కులపై శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చైల్డ్ పవర్ కౌన్సిలర్ శివలత మాట్లాడుతూ బాలికలు పరిరక్షణ, ఆపదలో ఉన్న సమయం లో పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాల్యవివాహం చట్టరీత్యా నేరమన్నారు. బాలికలకు వివాహం చేస్తున్నా, ఎవరైనా ఆపదలో ఉన్నా వెంటనే ఐసిడిఎస్ అధికారులు లేదా అంగన్వాడీ కార్యకర్త లేదా మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ నరసమ్మ, కార్యకర్తలు, కిశోర బాలికలు, పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలోని ఎస్‌బిఐ సమీపంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. జిల్లా ఐవిడి అధ్యక్షులు శేషాద్రి, ఎడిసిసి బ్యాంకు మేనేజర్ వెంకటాచలం, డాక్టర్ కరిడి రామయ్య, అసిస్టెంట్ మేనేజర్ గోవిందరెడ్డి హాజరయ్యారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ ఇస్తామన్నారు.

15న డప్పుకళాకారుల జిల్లా మహాసభ

ప్రజాశక్తి-గోరంట్ల

డిసెంబర్ 15వ తేదీ పుట్టపర్తిలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించనున్న జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి.హను మయ్య పిలుపునిచ్చారు. స్థానిక బిఆర్.అంబేద్కర్ కాలనీతో పాటు మండలంలోని మందలపల్లి గ్రామంలో శనివారం ఆయన డప్పు కళాకారులతో కలిసి మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన పింఛన్లు మంజూరు చేయాలని, డప్పు కళాకారుల వయసు 50 నుంచి 45 ఏళ్లకు తగ్గించి పింఛను ఇవ్వాలని, పింఛను మొత్తం రూ. 4వేల నుంచి రూ. 7వేలకు పెంచాలని, గుర్తింపు కార్డులు, ఆరోగ్యబీమా, ప్రమాద బీమా రూ. 5 లక్షలు, 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇవ్వాలని, బస్సు, రైళ్లలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఆయా అంశాలపై చర్చిస్తారని, కావున జిల్లా వ్యాప్తంగా ఉన్న డప్పు కళాకారులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు ఎవి.నాగరాజు, గంగాధర్, రామకృష్ణ, వెంకట్రాముడు, నరసింహప్ప, అశ్వత్థప్ప, మల్లికార్జున, నర్సింహులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'అన్నదాత సుఖీభవ' డబ్బులు జమ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అర్హులైన ప్రతి రైతు బ్యాంకు ఖాతాలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా డబ్బు జమ చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మండలంలోని వెంగళమ్మచెరువు గ్రామంలో శనివా రం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైత న్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడారు. భూగర్భ జలాల పెంపు నకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుకో వాలని సూచించారు. కాలానికి తగ్గట్టుగా సీజన్ పంటలు సాగు చేయాలన్నారు. గత వైసిపి పాలన లో రైతుల కు ఎలాంటి వ్యవసాయ పరికరాలు మంజూరు చేయలేదని, రైతాంగాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఎమ్మెల్యే నివాళి

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్న పుట్టపర్తికి చెందిన చెరుకూరి చంద్రశేఖర్ (45) కృష్ణాజిల్లా నందిగామ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని పుట్టపర్తికి తీసుకురాగా శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అలాగే చంద్రశేఖర్ కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. అంత్యక్రియల్లో నాయకులు బోయ రామాంజనేయులు, సామకోటి ఆదినారా యణ, గంగాధర్‌నాయుడు, రామారావు, అంబులెన్స్ రమేష్, జయప్రకాష్ , బేకరీ నాయుడు, సుబ్రహ్మ ణ్యం చెన్నకేశవులు, సురేష్ చౌదరి పాల్గొన్నారు.

రైతుల కోసం కోల్డ్ స్టోరేజ్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బలో ఏర్పాటు చేసిన సోలార్ కోల్డ్ స్టోరేజ్ రూమ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు రామచంద్రనాయక్, కార్యదర్శి నరసింహులు తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ రూమ్ వద్ద శనివారం వారు మాట్లాడుతూ ముది గుబ్బ వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (ఎఫ్‌పిఒ) ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వెనుక సోలార్ కోల్డ్ స్టోరేజ్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ గది సామర్థ్యం 10 టన్నులు అని, మండలంలో ఉన్న రైతులు అన్ని రకాల పండ్లు, కూరగాయలు, పూలను ఇక్కడ తక్కువ ధరకే నిల్వ చేసుకోవ చ్చు అన్నారు. అనంతరం వారు రైతులకు కోల్డ్ స్టోరేజ్ రూమ్‌ను చూపించారు. కార్యక్రమంలో కోశాధికారి చంద్రశేఖర్, ఎపిఎం నీలారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-బత్తలపల్లి

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని ధర్మవరం మండలం లోని దర్శినమల పిహెచ్‌సి వైద్యాధికారిణి డా. పుష్పలత సూచించారు. స్థానిక ఎంజెపి బాలుర గురుకుల పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. వంటశాల, బాత్‌రూమ్, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆర్‌ఒ ప్లాంట్ ఉండా సక్రమంగా పని చేస్తోందా అని ఆరా తీశారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవన్నారు. పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా బలంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సాంబశివమ్మ, ఆంజనేయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాబయ్యస్వామి ఉరుసును విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రఖ్యాతిగాంచిన శ్రీబాబాయ్యస్వామి ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ నర్సింగప్ప సూచించారు. ఉరుసు ఉత్సవాలపై శనివారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉరుసుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, తదితర సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆర్టీవో అధికారులకు సూచించారు. ఉరుసులో చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. చిన్నపిల్లలు తప్పిపోతే వెంటనే వారి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగిం చేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో అన్ని శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీలు

ఆర్డీవోకు వినతి ఇస్తున్న కొర్లకుంట ఎస్సీ కాలనీ వాసులు

శ్మశానవాటికకు దారిచూపాలని వినతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని కొర్లకుంట ఎస్సీ కాలనీ శ్మశానవాటికకు దారి చూపాలని డిమాండ్ చేస్తూ శనివారం కాలనీవాసులు పెనుకొండ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఆనంద్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు మొర పెట్టుకున్నారు. ఆర్డీవో మాట్లాడుతూ దారి సమస్యపై ఇప్పటికే కలెక్టర్‌కు నివేదిక పంపించామని, త్వరలోనే పరిష్కారం లభిస్తుందని హామీ ఇచ్చారని ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. కార్యక్రమంలో బహుజన సమైక్య వేదిక అధ్యక్షులు శివరామకృష్ణ, కె.నరేంద్ర, ఎస్.నరేష్, కెఎన్.రామాంజనప్ప, కె.నరసింహమూర్తి, జగన్నాథ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రీవెన్స్‌డే.. హాజరుకానున్న మంత్రి

రొద్దం : రొద్దంలో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేలో మంత్రి సవిత పాల్గొంటారని తహశీల్దార్ ఉదయశంకర్‌రాజ్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు తహశీల్దార్ కార్యాలయ ఆవరణ లోని స్త్రీ శక్తి భవన్‌లో గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని, మండల ప్రజలు సమస్యలపై అర్జీలు ఇవ్వాలన్నారు.

లెప్రసీ డిటెక్షన్ క్యాంప్

ముదిగుబ్బ : మండలంలోని గుట్టకిందపల్లి గ్రామంలో శనివారం మొలకవేమల పిహెచ్‌సి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో లెప్రసీ డిటెక్షన్ క్యాంప్ నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా స్పర్శ లేని మచ్చలు, ఇతరత్రా చర్మ సమస్యలతో బాధపడుతుంటే జాగ్రత్తలను సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి ప్రీస్కూల్ విద్య పునాది

ప్రజాశక్తి-గోరంట్ల

చిన్న పిల్లల సమగ్రాభివృద్ధికి ప్రీ స్కూల్ విద్య పునాది వంటిదని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి తెలిపారు. ప్రీ స్కూల్ ఈసిసిఈ డే సందర్భంగా శనివారం పట్టణంలోని ఎస్‌బిఐ కాలనీ, ఎస్సీ కాలనీ, శివాలయం వీధి అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చిత్రలేఖనం, పాటలు, కథలు, అక్షరాల అభ్యాసం, ఆటల ద్వారా విద్య, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లా డుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న కార్యక్రమాల ద్వారా పిల్లల్లో బుద్ధి వికాసం, బాషా నైపు ణ్యం, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మంజుల, లక్ష్మీనరసమ్మ, నూర్జహాన్ సహాయకులు జయాబాయి, జానకి, శ్రీనివాసమ్మ పాల్గొన్నారు.

మాటలు కోటలు దాటాయి..ఆచరణ గడప దాటలేదు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గానే కాకుండా... దీన్ని హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తామని నేతలు మాటల కోటలను దాటించారు. ఆచరణలోచూస్తే ఉద్యానవన రైతుకు నష్టాలు, కష్టాలు తప్ప పెట్టుబడులు కూడా వెనక్కురాని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది అన్ని ఉద్యానవన పంటల పరిస్థితి ఇదే తీరున సాగడం గమనార్హం. ఈ ఏడాదిలోనే ఫిబ్రవరి 5వ తేదీన అనంతపురం నగరంలో హార్టీకల్చర్ కాన్‌క్లావ్ పేరుతో అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హడావుడే చేశారు. అంతేకాకుండా ఐదేళ్ల ప్రగతిలో ఉద్యానవన పంటలకు ప్రథమ స్థానం కల్పించడం తో పాటు ఇప్పుడున్న దిగుబడులను రెండింతలు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని గొప్పగొప్ప మాటలే చెప్పారు. ఆచరణలో రైతుకు మిగిలింది ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. అధికారులు అప్పుడు కనబరచిన లెక్కలు ఈ విధం గా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 1.04 లక్షల ఎకరా ల్లో ఉద్యానవన పంటలు విస్తరించాయి. 25.95 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్టు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా అరటి, మామిడి, చీనీ, టమోటా పంటలున్నాయి. గడిచిన ఐదేళ్లలో 20 లక్షల మెట్రిక్ టన్నులు ఏడాదికి వస్తుండగా వాటి ద్వారా టర్నోవర్ రూ.5535 కోట్లు ఏడాదికి జిల్లాలో జరుగుతున్నట్టు అంచనా వేశారు. ఇందులో అరటి పంట 10946 హెక్టార్లలో ఉండగా 6.02 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుంది. దీని ద్వారా రూ.1204 కోట్ల జివిఎ ఉంటుందని కాన్‌క్లేవ్ సమయంలో రూపొందించిన నివేదికలో పేర్కొ న్నారు. ఇక 10128 హెక్టార్లలో 56 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుంది. దీని జివిఎ రూ.567 కోట్లుకాగా, మిరప పంట 14177 హెక్టార్లలో పండిస్తున్నారు. దీని దిగుబడి 71 వేల మెట్రిక్ టన్నులు రూ.1205 కోట్లు టర్నోవర్ జరుగుతోంది. ఇక 16618 హెక్టార్లలో టమోట పంట సాగవు తోంది. ఏటా 8.30 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబ డులు వస్తున్నాయి. వీటి జివిఎ రూ.997 కోట్లు ఉంది. చినీ పంట 37186 హెక్టార్లలో సాగవు తోంది. దీని దిగుబడులు 5.21 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుండగా రూ.1562 కోట్లు జివిఎ ఉంది. ఇలా అన్ని రకాలుగా ఉత్పత్తులు విలువను కాన్‌క్లేవ్ సమయంలో కనబరిచారు. అదే సభలో ఉద్యనవన రైతుల తలరాతను మారుస్తున్నామం టూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. పండిన పంటను అమ్ముకుని రావడానికి రైతులు జిల్లా నుంచి విమానంలో పోయి వస్తున్నారని కూడా చెప్పారు. ఈ ఏడాది చూస్తే ఏ ఒక్క పంటకూ సరైన గిట్టుబాటు ధర లేదు. అరటి పంటకు ధరలేక దున్నే సుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు మామిడి రైతులు కూడా ఈ ఏడాది సరైన ధరలేక తీవ్రంగా నష్టపోయారు. చీనీ రైతు పరిస్థితి అదే విధంగా ఉంది. ఇటువంటి సమయంలో మాత్రం ప్రభుత్వం రైతును ఆదుకునే చర్యలేవీ తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అరటి రైతు పంటలేక అవస్థలు పడుతుంటే ఆ పొలాలను పరిశీ లించి ఆదుకుంటామని చెప్పిన ఒక్క ప్రజాప్రతినిధి కూడా జిల్లాలో కనిపించక పోవడం శోచనీయం. ప్రభుత్వం తగ్గిన ధరకు సబ్సిడీగానీ, రూ. 8 వరకు ధరను కల్పించాలని కోరుతున్నారు. ఆ దిశగా నేతలెవరూ కన్నెత్తి చూడటం లేదు. విపక్షాలు మాత్రం దీనిపై ఆందోళన చేపడుతూనే ఉన్నాయి. అనంతపురం కలెక్టర్ ఆనంద్ క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాపారులతో మాట్లాడి ధర పెంచే ప్రయత్నం చేస్తున్నా, వ్యాపారుల నుంచి మద్దతు లభించడం లేదు. ధరలేక తీవ్రంగా నష్టపోతున్న ఉద్యానవన రైతులను ఆదుకునేలా ప్రభుత్వాలు ముందుకు రావాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలు కాకుండా ఆచరణాత్మకమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సైనిక సంక్షేమనిధికి విరాళాలు ఇవ్వండి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన సైనిక కుటుంబాల సహాయార్థం సాయుధ దళాల పతాక దినోత్సవం నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శనివారం ఆయన సాయుధ దళాల ఫ్లాగ్ డే సంక్షేమ నిధికి సంబంధించిన కార్ ఫ్లాగ్‌లు, స్టిక్కర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల సేవలకు గుర్తింపుగా పౌర సమా జం ఇచ్చే గౌరవం చిహ్నంగా ఈ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. సైనికులు, మాజీ సైనికుల మనం అండగా నిలవాలన్నారు. ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప మాట్లాడుతూ కార్ ఫ్లాగ్‌లు 5వేలు, స్టిక్కర్లు 3,500 అందుబాటులో ఉంచామని, కార్ ఫ్లాగ్ రూ. 5, స్టిక్కర్ రూ. 2 గా నిర్ణయించామన్నారు. జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి, అనంతపురం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతా నెం : 62076956433, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ : ఎస్‌బిఐఎన్0021438 కు విరాళాలు ఇవ్వాల న్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి సిహెచ్.పురుషోత్తం, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్లు, పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

హాస్టల్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కొత్తచెరువు

ధర్మవరం మండలంలో వలస వెళ్లే తల్లిదండ్రుల పిల్లలకు ఎపి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 2026 ఏప్రిల్ వరకూ హాస్టల్ నిర్వహణకు దరఖాస్తు చేసుకోవాలని సమగ్ర శిక్ష సమన్వయకర్త దేవరాజు తెలిపారు. పొదుపు సంఘాల సభ్యులు, ఎన్జీవోలు బుక్కపట్నంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో డిసెంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తు అందజేయాలన్నారు.

లేఅవుట్లను క్రమబద్ధీకరణకు అవకాశం

ప్రజాశక్తి-నల్లమాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం పుడా అధికారులు, పంచా యతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆగస్టు 2025కి ముందు అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని పుడా అధికారులు ఆదేశించారు. ఆ తర్వాత చేపట్టిన నిర్మాణాలు, లే అవుట్లు ఖచ్చితంగా అనుమతి తీసుకోవాలన్నారు. లేనిచో తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పుడా అధికారులు అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ రామకృష్ణుడు, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ రేవాపతి, ఎంపిడిఒ జి.శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ అబ్దుల్ మునాఫ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి నీరు వదిలితే చర్యలు

తలుపుల : మేజర్ పంచాయతీ పరిధిలో హోటళ్ల యజమానులు, దుకాణదారులు ఇష్టారాజ్యంగా రోడ్డుపైకి వృథా నీటిని వదిలితే కఠిన చర్యలు తప్పవని డిపిఆర్‌సి విశ్వనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవనప్ప నాయుడు హెచ్చరించారు. వారు శనివారం రోడ్లపై కలియ తిరిగారు. వారు మాట్లాడుతూ రోడ్లపైకి నీరు చేరడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు హోటళ్లు, దుకాణాల నిర్వాహకులను హెచ్చరించినా ప్రయోజనం లేదని, ఇకపై ఎవరైనా రోడ్డుపైకి నీరు వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజల కోసం పనిచేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి-గాండ్లపెంట

అన్ని శాఖల అధికారులు ప్రజల కోసం బాధ్యతగా పని చేయాలని ఎంపిపి జి. సోమశేఖర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా నూతన ఎంపిడిఒ టి.రామకృష్ణను అధికారులు, ప్రజాప్రతి నిధులు సన్మానించారు. ఎంపిపి మాట్లాడుతూ ప్రజలను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా ప్రతి సమస్య పరిష్కరించాలన్నారు. ఎపిఒ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రూ. 8.5 కోట్ల మెటీరియల్ బిల్లులు మంజూరయ్యా యన్నారు. జాబ్‌కార్డ్ ఉన్న ప్రతి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని, ప్రజాప్రతినిధులు సహకరించాలని తెలిపారు. పని ప్రదేశంలో ఉదయం, సాయం త్రం ఫొటోలు తీయాలన్నారు. హౌసింగ్ ఏఈ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ నిరుపేదలందరికీ గృహాలు మంజూరు చేస్తామని, 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2019కి సంబంధించి అర్ధాంతర ంగా ఆగిన గృహాల బిల్లులు మంజూరు చేస్తామ న్నారు. కురుమామిడి సర్పంచి సుధాకర్ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం గ్రామాల్లో ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేశామని, దానికి రూ. 8లక్షల బిల్లులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపిడిఒ పరిశీలించి బిల్లులు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి అమరావతి, ఎంపిటిసిలు భారతి, గంగోజమ్మ, సర్పంచులు రవీంద్ర నాయక్, శాంతమ్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆకట్టుకున్న పిల్లల వేషధారణ

అమడగూరు : మండలంలోని ఎ.రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. ఉపాధ్యాయురాలు రోజా మాట్లాడుతూ పిల్లల మానసిక ఉత్సాహం, ఉల్లాసం కోసం వారంలో ఒక రోజు నో బ్యాగ్ డే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు వివిధ వేషధారణలో హాజరై ఆకట్టుకున్నారు. విద్యార్థులకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. అందులో పేట గగన్, నేహ సాయి ప్రీతి, నిత్య ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. ప్రత్యేక వేషధారణలో హాజరైన ప్రతి విద్యార్థికీ బహుమతులు అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పరిగి : మండలంలోని ఊటుకూరు గ్రామ సమీపంలో పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం గ్రామస్తులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా రాత్రివేళ అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తులు కాపు కాచి ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని గ్రామస్తుల కోరారు.

జూడో జట్లకు టీ షర్టులు అందజేత

ధర్మవరం రూరల్ : చిగిచెర్ల ప్రభుత్వ జడ్పీ హైస్కూల్‌లో శనివారం 69వ ఎపి ఎస్‌జిఎఫ్ ఇంటర్ జిల్లా జూడో ఛాంపియన్‌షిప్(2025-26) పోటీ లు నిర్వహించారు. అండర్-14, 19 విభాగాల బాల, బాలికల జూడో జట్లకు శనివారం పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 600 టీ షర్టులు ఉచితంగా అందజేసినట్లు ఆ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. చింతలపల్లి మహేష్ చౌదరి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను, క్రీడలను ప్రోత్సహించడంలో పరిటాల కుటుంబం ఎప్పుడూ ముందుంటుందన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-బుక్కపట్నం

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ నరసింహులు సూచించారు. పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా శనివారం స్థానిక ఎస్సీ కాలనీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, ఏవో నటరాజ్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, సమాజంలో పౌరులందరికీ సమాన హక్కులు ఉంటాయని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి సూచిం చారు. మండలంలోని సిరివరం గ్రామంలోని అంబేద్కర్ కాలనీలో తహశీల్దార్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. అధికారులు మాట్లాడు తూ రాజ్యాంగం ప్రజలందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచి నేత్రావతి, ఎంపిడిఒ నరసింహమూర్తి, పంచాయతీ కార్యదర్శి సాయి, ఆర్‌ఐ ప్రమీలమ్మ,తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : పౌర హక్కులు తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వాటికి అనుగుణంగా బాధ్యతలు నిర్వర్తించడం అంతకంటే ముఖ్యమని డిప్యూ టీ తహశీల్దార్ జగన్నాథ్ తెలిపారు. మండలంలోని వీరాపురం గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీపతిరెడ్డి, కానిస్టేబుల్స్ సుధాకర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి అదనపు గదుల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కటారుపల్లి క్రాస్‌లో ఉన్న కెజిబివిలో అదనపు గదుల నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్థలాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన కెజిబివికి చెందిన స్థల వివరాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల సమీపంలో ఉన్న శ్మశానవాటికకు, లక్ష్మీ నరసింహస్వామి స్థానానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరినాథ్, ఎంపిపి జి.సోమశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు పి.రామాంజులురెడ్డి, ప్రసాద్, చిన్నోడు, అక్రమ్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ప్రజాదర్బార్‌లో అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి త్వరితగతిన పరిష్కరించాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. పట్టణంలోని ఎర్రగుంట సర్కిల్‌లో ఉన్న టిడిపి కార్యాలయంలో శనివారం పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజలు విద్యుత్, సీసీ రోడ్లు, డ్రెయినేజీ సమస్యలతో పాటు 15 రోజులకు ఓ సారి కూడా చెత్త సేకరణ చేపట్టడం లేదని అర్జీలు ఇచ్చారు. స్పందించిన శ్రీరామ్ ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పంట నీటి ప్రణాళికపై రైతులకు అవగాహన

తలుపుల : మండలంలోని సోమలవాండ్లపల్లి గ్రామంలో శనివారం సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో సిఎస్ఎ స్టేట్ కోఆర్డినేటర్ ఆదినారాయణ అధ్యక్షతన పంట నీటి ప్రణాళిక వర్క్ షాప్ నిర్వహించారు. హైదరాబాద్ సిఎస్ఎ నీటి యాజమాన్య నిపుణులు డా. ఉమామహేశ్వరరావు పంట నీటి ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. ఎ పంటకు ఎంత నీరు అవసరం, భూమిలోకి ఎంతనీరు ఇంకుతాది, పొలాలకు ఎంత అవసరం, మనుషులకు తాగడానికి నీరు ఎంత అవసరమో వివరించారు. అనంతరం తలుపుల రైతు ఉత్పత్తిదారుల సంఘం 4వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉడుమలకుర్తి సర్పంచి వెంకటపతి, బిఒడి మెంబర్ వెంకటేశ్వర్లు, సిఎస్ఎ ప్రోగ్రాం ఆఫీసర్ రమణ, జనార్ధన్, కోఆర్డినేటర్లు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. దంపతులకు గాయాలు

ప్రజాశకి-బత్తలపల్లి

మండలంలోని మాల్యవంతం సమీపంలో శనివారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో దంప తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని అనంతసాగరం గ్రామానికి చెందిన గుజ్జల నాగేంద్రయ్య, నాగేంద్రమ్మ దంపతులు కూరగాయల వ్యాపారం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వారు. ఈ క్రమంలో వారు శనివారం ఉదయం ఆటోలో కూరగాయలు వేసుకొని వెళ్తుండగా ధర్మవరం నుంచి పాఠశాల విద్యార్థులను తరలించే ఆర్టీసీ బస్సు మాల్యవంతం సమీపంలో వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడగా స్థానికులు వారిని 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులతో వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా బాధితులు, బస్సు డ్రైవర్ రాజీ అయినట్లు సమాచారం. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిసింది.